చెంచయ్య కథ తెలుసా? మీ పెదతాత చెప్పేవాడు అప్పులకొచ్చే వాళ్ళకి. వాకిట నులకమంచం వేసుకు, పులిలా కూచునేవాడు కబుర్లూ కథలూ చెపుతూ. నివ్వెప్పుడన్నా విన్నావో లేదోగాని నాకు అస్తమానం మనసులో మెసుల్తూనే వుంటుంది. వరాలుమీద జాలివేస్తుంది, కోపం

వస్తుంది, నవ్వూ వస్తుంది— చిన్నప్పుడు ఉట్టి కథే అనుకున్నా, తరవాత తరవాత దాంట్లో మజా అనుభవాలైనకొద్దీ తెలిసొచ్చింది.

నువ్వాకథ వినుండవులే. చేబదులు చెంచయ్యని పిలిచేవారు. ఒకటిగాని వందగాని నోటిమాటనే తప్ప నోటుమాట రాకుండా పుచ్చు కోడం అతగాడి పెగ్గె. అబ్బో, ఇప్పటికథా, నువ్వు మీ అమ్మ కడుపున పడడానికి పుష్కరం నాటి మాట. ఎందుకు గుర్తుండిపోయిందీ అనేవు మీ అమ్మకి సీమంతం జరిగేరోజున నాదగ్గరకొచ్చి ఓ పాతికవేలు చేబదు లిస్తావా బావా అన్నాడు. చెప్పొద్దూ, నాకు నవ్వొచ్చింది. అలాగే ఇంకా సేపు ఊసులాడి నవ్వించి, పాతిక రూపాయలు పట్టుకపోయాడు. చెప్పొ చ్చింది విను.

చెంచయ్య ఇలాగే మేలమాడినట్లే యేడుకొండలని ఒక పెదకాపు దగ్గిర నాలుగొందలు చేబదులడిగాడు. ఏడుకొండలు డబ్బు వడ్డీకి తిప్పే వాడే అనుకో, అయితే యెంత హెచ్చరిగ్గా నిర్వాకం చేసేవాడనీ, ఓరబ్బో ఆవలించమని పేగులు లెక్కెట్టేసుకునేవాడు మళ్ళీ మనిషి మారుగిల పడ కుండా. అప్పుడు శతకోటి లెక్కలుచెప్పి ప్రాణాలుతోడేసి మరీ విదిపే వాడు డబ్బుని. వసూళ్ళుకూడా అంతే. రాక్షసుడే, అయితే ఒక సుగుణం. ఆ మాట ముందే చెప్పేసేవాడు, ఏదీ యిలా నేను రాక్షసుడిని బావా అని. ముందు ముందు ఎలాగా యవారం బెడుస్తాది. వాడెలాగా వీణ్ని కాబోలీ దెయ్యం అంటాడు. అప్పుడు వీడు, నేను మొదటే చెప్పానుగా, నీకు తెలుసు అని నవ్వి మరీ కుప్పమీద పంట, అవసరమైతే పైమీది బట్టకూడా యెగరేసుకు పోయేవాడు.

యేడుకొండలికి ఒక్కగానొక్క బిడ్డడు. వాడికోసారి వాతం కమ్మి ప్రాణమ్మీదికొచ్చేవరకు చెంచయ్య రాత్రికి రాత్రి మూడామడదూరం

వల్లకాటి కడ్డంపడిపోయి దేవరగార్ని వున్నఫళంగా లేవదీసుకొచ్చి మందు పోయించి పోయే ప్రాణానికి చక్రంవేసి అట్టే నిలబెట్టాడు. ఆ విశ్వాసం యే మూలో నిలదొక్కుకుంది ఏడుకొండలకి.

అదో, మరి ఇంకేకళనున్నాడో, రెండుపుంజీల అప్పుకి చెంచయ్యగాడు నాలుగొండలకాడ బేరంపెట్టగా, తీసుకో బావా! నీకు చర్మం చెప్పులు కుట్టిచ్చినా ఋణం తీరుద్దా అంటూ – వడ్డీ గిడ్డీ వద్దులే అంటూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వల్లమాలిన వరాలు, షరతులు పెట్టకుండా నాలుగు పెద్దనోట్లు వాడిచేత బెట్టాడు. పంటలు దింపగానే మళ్ళీ యిచ్చెయ్యాలని మటుకు మాట దీసుకొన్నాడు. నెత్తిమీద వున్నమిచంద్రుడూ బండి నీడలో నేనూ కొంచెం అసింటా. అడుగో నీ పెళ్ళాం నిలబడ్డంత దూరాన, ఏడు కొండలు, ఇంటిదీ సాక్ష్యం.

మూడు తిరిగి నాలుగో పున్నమొచ్చేనాటికి రొక్కం సర్దుబాటవుతుందనీ, తప్పకుండా ఇచ్చేస్తాననీ, వడ్డీకూడా పదో పరకో ముట్టచెబుతాననీ సత్తె పెమాణం పెట్టాడు చెంచయ్య. ఇలా ఆపదకి అడ్డు పడ్డందుకని కంటతడిబెట్టాడు కూడా.

చెంచిగా నీకు అంత డబ్బెందుకురా, ఆడిస్తాడని నువ్వు తీసుకుంటున్నావా, నిజంగానే కావాలా. ఆనక మళ్ళా యిప్పుకునేటపుడు టరుపవుద్దని నేను ఓ మూల నసిగాను. ఛెఛెస్ నీకేటి తెలుసు నా అవుసరం అని యెగిరాడు. ఏడుకొండలుకూడా యేమనుకున్నాడో మరి ఔనే బావా, కొంచెం ముందెనకలు చూసుకు మరీ తీసుకోడం మంచిది గాదా, ఆనక ఈడిపేరేడుకొండలేగాని, పుట్టెదవనాయాల, కాబూలీ జీబూతం అనగలవు, చూడు మరి అన్నాడు పరాసికంగా అన్నట్టు.

కాదుకూడదంటూ అవురుబావురని రొక్కం లాగేసుకు రొంటిని దోపేసుకున్నాడు చెంచయ్య.

ఏమోలే. పిల్లా జెల్లా ఉండె, పైగా రొండుకాపురాలాయె ఆడికేటి అవుసరమో మనకేల అని నేనూరుకున్నాను.

నేననుకున్నట్టే అయింది. వారం తిరిగేసరికి పెద్దామె అక్కా బత్తుల వాడింటి మీదపడి దుమ్మెత్తిపోస్తోంది. చిన్నామెకి పట్టెడ పురమాయించి నప్పుడు నాకేల జెప్పలేదు అని. తరువాత సవుతులిద్దరూ తగవులాడు కున్నారు. నీకు పిల్లాజెల్లాలేరు. గొడ్రాలివి.... నీకేం కులుకుతావు. నీకు దోచిపెట్టే అప్పుల్తో నా కొంప గుండం చేస్తున్నాడు అంది పెద్దామె. ఆపైన ఏడుకొండల్నికూడా తూర్పారబట్టేసింది.

వింత జెబుతా విను. ఇంతపోరూ అయేసరికి చెంచయ్యకి యేడు కొండలమీద మనిషికొచ్చినంత కోపమొచ్చేసింది. ఈ యెదవనాయాల యియ్యమట్టిగదా నే బుచ్చుకున్నా, దాని మూలానేగదా చిన్నమ్మికి పట్టెడ చేయించడం, పెద్దమ్మికి ఉసురు పెట్టడమూను అని ఆవాడనా ఆవాడనా అన్నాట్ట. ఏడుకొండలికి పౌరుషమేసుకొచ్చింది. న్యాయాల నే నొద్దు మొర్రో అంటే పేణం కడంటేలా పీక్కు తినేశాడుగదయ్యా అన్నాడు. కాని ఎంత రాక్షసుడయినా మంచి ముండావాడేమో తమాయించుకున్నాడు. చెంచయ్యకిమట్టుకు కోపం పోలేదు. ఇంత వొంచనజేసి నన్ను పెడదారిన పెడతాడా, ఇలా ఎన్ని కొంపలు కూలిపోతున్నాయో అని నచ్చజెప్పు కున్నాడు.

అంచేత డబ్బు చేతికందిన రోజున ఏడుకొండలు గుమ్మానికొచ్చి పిలిచేవరకు చెంచయ్యకి డబ్బు వదులుకో మనసు కాలేదు. మనసు నీరుగారి

పోయింది. చచ్చి చెడి గడించిన డబ్బంతా ఈడెదాన ఒక్కసారి గుమ్మ రించడమేవిటని విసుక్కున్నాడు. ఆపైన మళ్ళీ ఏమనుకున్నాడో యేం జాలిపడ్డాడో లేకపోతే ఏడుకొండలు కండమచూసి ఇంకేమన్నా అను కొన్నాడో మొత్తానికి శాంతంగానే యీవలకొచ్చి, కూచోమని దాహం అడిగి, కుశలంజెప్పి, బావా ఒక్కిన్నపం అన్నాడు.

ఏంది చెంచయ్యా అన్నాడేడుకొండలు కులాసాగా.

మరేంలేదు బావా. నగదేమో చేతికొచ్చినమాట రైటే. నీకు దెల్సునుకో. కాని ఇప్పుడేగదా అందిందీ. ఇంకా సరిగ్గా లెక్కెట్టికూడా చూడ లేదాయె అంటంది నీ చెల్లెమ్మ అంటూ నసిగాడు.

ఏడుకొండలు నవ్వాడుగాని మాటజారలేదనుకో.

అయినా ఆ కాస్త నవ్వే దొరకబుచ్చుకుని పుంజుకున్నాడు. రెండ్రోలు యింట్లోవుంచుకుని నీది నీకు పువ్వుల్లో బెట్టిచ్చెయ్యనూ, అందులో కానీ ముట్టుకుంటే ఒట్టు... మరేంలేదు, మాలక్ష్మి యిలా కొంపలో అడుగుపెట్టిందో లేదో అప్పుడే మళ్ళగొడితే మనసు పీకుతాదని బుల్లెమ్మ ఇదవుతుంది అన్నాడు.

సర్లే. నీమాటే కానీయ్ అంటూ చెంచయ్య బుడ్డాడి బుగ్గ పుణికి, చేతిలో జీళ్ళపొట్టం వాడిచేత పెట్టి వెళ్ళిపోయాడు.

రెండ్రోజులు తరవాత మనింటిదగ్గర జతపడ్డారిద్దరూ. అప్పుడే బాకీ బాగోతం అంతా బాగా తెల్సిందనుకో. ఏడుకొండల్ని చూడగానే చాటుకి పిలిచి, బావా నీ డబ్బు అలాగే ముడిగట్టుందయ్యోవ్! అన్నాడు చెంచయ్య తెచ్చిపెట్టుకు నవ్వి.

మరేమంటావు. నేను వచ్చేట్టా, మాపిటికి నువ్వు దెచ్చేట్టా అన్నాడు ఏడుకొండలు.

మాపిటికే గావాలంటావా. పిల్లలు పెడతదేమిటి అన్నాడు చెంచయ్య చనువుదీసుకుని.

యాడవబోయి బావుండదని నవటాలంటే యేవిటో ఏడుకొండలు మొగం చూడగా నా కానాడు దెల్సింది.

యాడాది రెక్కలకష్టం గదా, అందులో ఒక్కరూపాయి డబ్బెట్టి పప్పా వణ్ణవూ౹ సుబ్బరవైన కూరా చేసుకుదిన్న పాపానవోలేదూ మన వేఁడత్తాయిత్తే అన్నకి మటుకేవి౹ సుకవూ౹ అంటదయా చెల్లమ్మా అని నసిగాడు చెంచయ్య.

ఏటో మీ చాదస్తాలు మరీ చిత్రంగున్నాయి అంటూ వెళ్ళిపోయాడు ఏడుకొండలు.

వారం తిరిగాక ఓరోజు మద్దినేళ చెంచయ్యింటికి వెళ్ళాడు ఏడుకొండలు.

ఎండని పడొచ్చావేటి సేషాలన్నాడు చెంచయ్య.

కొత్తవేటున్నాయి గనకా అన్నాడు ఏడుకొండలు గుంభనగా.

పాతవి మటు కేవున్నాయి అన్నాడు చెంచయ్యఇంకా తొణక్కుండా.

—డబ్బు కాకా— అని మాట జారేసింది బుల్లెమ్మ.

శాస్తరం జెప్పినట్టుంది, బావకస్తమానూ అదే జాసనుకున్నా వేటి మన్లాగా అన్నాడు చెంచయ్య—నవ్వినా పెళ్ళాంకేసి కొరకొర జూసి.

మీ సంగతేవోఁ నా కెరుకలేదుగాని, నాకు మటుకు డబ్బు గావా లయ్యోయ్ అన్నాడు ఏడుకొండలు సిగ్గువిడిచి.

అంత మోటగా తీసుకుపోవద్దని బతిమలాడాడు చెంచయ్య. ఇంటో తెచ్చి పదిరోజులైనా ఉంచుకోకుండా ఇస్తే మనసొప్పటం లేదన్నాడు. ఎలాగా ఇచ్చేసేదిగదా అన్నాడు. ఇంకొక పదిరోజులుంచుకోనీ అన్నాడు.

సరేనన్నాడు ఏడుకొండలు. పది వెళ్ళాక పదకొండో రోజున అడిగితే, ఇవాళ సుక్కురారంగదా చూస్చూసి మాలక్ష్మిని ఎలా పంపుకోను అన్నాడు.

శనివారంనాడు ఏడుకొండలు గుమ్మంలో కొచ్చేసరికి చూడనట్టు లోపల కూర్చుని తలుపేసుకుని పెళ్ళాన్ని పిలిచి, ఆ శనిగాడొస్తాడు డబ్బెక్కడుందో చూడమని గట్టిగా పురమాయించాడు.

ఏడుకొండలకి ప్రాణం నీరుగారిపోయి వచ్చిన వాడొచ్చినట్టే వెనక్కెళ్ళిపోయాడు.

ఆదివారంనాడు చెంచయ్య సంతకెళ్ళాడు.

సోమవారంనాడు చెంచయ్య బుల్లోడు, ముంతెడు రూపాయిలూ కలబోసుకు ఆడుకుంటున్నాట్ట, వాణ్ణి ఏడిపించటం ఎలా? సరే మంగళవారం ఎలాగేనా మంగళారం గదా బుధవారం నాడు మటుకు ఇదిగో పదబావా, నీవెనకాలే వస్తున్నా, ఎంతేనా కష్టారితం చూడు అన్నాడు చెంచయ్య.

నాది మటుకు కాదేటి. అప్పనంగా వచ్చిపడ్డ బాపతనుకున్నావా అన్నాడు ఏడుకొండలు.

అంతమాటన్నానా శాంతపడు అన్నాడు చెంచయ్య నవ్వి— అప్ప నంగా వచ్చింది అప్పులాళ్ళ కడుపుకొట్టి కొంపలార్పి, వడ్డీలుగా పోగేసింది కాకపోతే ఇది కష్టార్జితమా ఏవిటని మనసులో అనుకున్నా. అందుకని తన కష్టార్జితం మీద జాలేసింది. పాపం అనుకున్నాడు కూడా మొత్తానికి బుధ వారం నాడు ఏడుకొండలు వెనకాలే డబ్బు మోసుకొస్తానన్నాడుగాని అంత పని చెయ్యలేదు. పిల్లాడు కబుర్లు చెపుతావుంటే సరదాగా కూచుండి పోయాడట.

లక్షింవారం, సుక్కురారం, శనివారం ఏడుకొండలు అటువే పెళ్ళనే లేదు. ఆదివారంనాడు చెంచయ్యే కబురెట్టాడు ఏడుకొండలికి.... ఒక్కసారి చూసిపొమ్మని.

ఒంట్లో నలతగా ఉంది బావా. పులపరం తగిలిం దంతకన్నేం లేదని బుల్లెమ్మందిగాని ప్రాణం బేజారుగాఉంది. నేనే పైకం తెద్దామనుకొన్నాను, గాని వొల్లనయింది గాదు అన్నాడు చెంచయ్య నీరసంగా.

ఏడుకొండలికి తలకొట్టేసినట్టయింది. ఇన్నాళ్ళూ అందరూ అంద రితోపాటు తనూ, తనని యములాడనన్నా నవ్వేసేవాడు. ఈసారి నిజం గానే తను యముడు అయినట్టనిపించింది. ఆ రోజుల్లో ఉండుండి మీసం తడుముకొనేవాడు. దున్నపోతుకీ బర్రెలకీ దూరంగా నిలబడేవాడు.

అలాగే కానీ అన్నాడు దిగులుగా.

మరేంలేదు. కొంపలో నాలుగురాళ్ళున్నాయన్న ధీమా చూడూ, అదే పదిమందుల పెట్టు. పత్తెం దినగానే.... అన్నాడు చెంచయ్య.

పదిహేనురోజులిగ్గాని పత్తెం దిన్నట్టు పట్టీకున ఒప్పుకున్నాడుగాదు చెంచయ్య.

ఈలోగా ఏడుకొండలు డబ్బుకి రొక్కసంపద్దా నోరు మూసుకున్నాడు.

ఆ తరువాత అతను నోరెత్తిన రోజుని చెంచయ్య గజగజలాడిపోయాడు — మార్గశిరమాసంలో గోదాట్లో స్నానం జేసినాడిలా.

అంతలో నోరు పారేసుకున్నందుకు ఏడుకొండలికి మళ్ళీ మనసెలాగో అయిపోయి శాంతపడి ఇంటికెళ్ళిపోయాడు.

మర్నాడు, అతన్ని వాకిట కూచోబెట్టి చెంచయ్యా బుల్లెమ్మా చెరో వెంపూ జేరి ఓదార్చారు. మరేం ఫరవాలేదు, తిడితే తిట్టావు మేం కోపం జేసుకోంలే అన్నారు. నువ్వు కాకపోతే మరెవ్వరు తిడతారన్నారు. మరోడు తిడితే ఊరుకుంటామా అన్నారు. ఊరుకునేది లేదని కూడా ఖచ్చితంగా చెప్పేశారు. ఆనక చెంచయ్య డబ్బుసంగతి కూడా మెల్లిగా నచ్చచెప్పారు.

ఏడుకొండలకి వెంటనే ఆ నాలుగొందలూ ఇవ్వడానికి అభ్యంతరం లేనిమాట నిజమేట. కాని అంత దూకుడుగా వెళ్ళి ఆ నాలుగొందలూ చక్కబెట్టే రాచకార్యాలేముంటాయి గనుక. చేసే నిర్వాకం ఏముంటుంది గనుక. అవేమన్నా పిల్లలు బెడతాయా. ఆ మాటకొస్తే ఓ నెల్లాళ్ళపాటు ఇందమ్మటే తన ఇలాకాలో ఉంటే పాతికా, పరకా వడ్డీవస్తే పిల్లలకీ బట్టా పాతా కొనవచ్చు. ముసల్ది మూడేళ్ళమట్టి సణుక్కుంటోంది ఓ కొత్త గొంగళీకొని దగలెయ్యమని. అందుకని, మొన్నే....డబ్బు ఇంటో ఊరికే పడుంటే ఎవడు దిన్నట్టని—మొన్నంటే మొన్న ఒహ కావలసి నాయనికి సర్దాడట ను. మళ్ళీ నెల తిరక్కుండా తిరిగొచ్చేస్తుంది పైకం. అవతలివాడు చాలా పెద్దమనిషి. మరోడూ మరోడూ కాదు, అన్నవేళకి తప్పకుండా జమ

సేస్తాడు, దేవుడంటే నమ్మ ఏడుకొండలూ అంటూ జరిగిన విషయం చెప్పుకొచ్చాడు.

ఏడుకొండలికి మధ్యలో ఓచోట కోపం వచ్చింది. ఓ చోట దుఃఖం పొర్లిపోయింది. ఇంకోసారి ఖూనీ చేద్దామని బుద్ధి పుట్టింది. ఓసారి తనే పొడుచుకు చద్దామని, అందుకు ముందో వెనుకో ఈ చెంచయ్యగాడికి అప్పిస్తానన్న నాలికని తెగ్గోసేసుకోవాలనీ మనసైంది. మరోసారి ఆలు మగలిద్దర్నీ వేలంపాడి పారెయ్యాలనిపించింది. చివరికి జరిగింది మాత్రం భోరున ఏడిచి నెత్తికొట్టుకొని ప్రాణం చాలొచ్చి కుప్పకూలిపోవడం. ఆలు మగ లిద్దరూ అతన్ని పోగేసి లేవదీసి కుదేసి మంచినీళ్ళిచ్చి పంపేసారు దప్ప డబ్బు ఇవ్వలేదు. ఇచ్చేందుకు డబ్బు లేకనా అనడగవేం? డబ్బేమో ఉండె.

కాని రెక్కలార్చి గడించినదాన్ని ఈ యములాడి ఎదాన గొట్టటానికి చేతులురాలేదు. వాళ్ళుమటుకేం జేస్తారు, అప్పుతీర్చే డబ్బు అలాటిదాయె. తీర్చేటప్పుడు ప్రతి మనిషికీ మనసలా ఉండునాయె.

నువ్వు కావాలంటే ఓసారి మన చిత్తాబుక్కు సూడు.

బదులు తీసుకొన్న పైకాన్ని అసలసలుగా మొత్తంగా జమకట్టినకాతా లెన్నున్నాయోలెక్కెట్టిచూడు. వందబుచ్చుకున్నవాడికి, వందా వచ్చినా ఇవ్వడానికి చేతుల్రావు. తొంభై ఇస్తాడు. పదీ ఆనకపంపుతా బాబాయ్ అంటాడు. ఇంతడబ్బు నీ ఎదాన కొడుతూ వుంటే వెధవ పది రూపాయలకి ఏడవక్కర్లేదులే అన్నట్టు ఆనక ఆ పదీ ఏదిరా అవి మనం అడిగితే వాడిచ్చిచచ్చాడా. చిన్నదయిపాయె. ఏదిరా అని అడిగితే మనం నూగింజకి నాలుకజాపే దరిద్రులం అయిపోతాం. అడక్కపోతే అమాటేనా

ఉందా. మళ్ళీ అప్పుకొచ్చినపుడు నీ పాత బాకీ అణా పైసల్తో పారేశా కావా లంటే చిత్తాజూసుకో అంటాడు. పదుమ్ఫ్చుకున్నవాడు అందులో రెండుకో మూడుకో నామం బెడతాడు. ఇదీ మనకి దక్కే వడ్డీ.

ముసలాడు పొద్దున్నే కూచోబెట్టి ప్రాణం తోడేశాడనుకునేవు. ఊరికే లోకమ్మీద సంగజ్జెప్పాను. నీ జతగాడు మంచివాడే కావచ్చు. కానీ సంగతది. బాకీ తీర్చేటపుడు డబ్బు విదల్చడానికి ఓ పట్టాన ప్రాణం వొప్పదు. ఇదన్నా డబ్బు వుంటే గింటే మాట. అసలు చేతికే డబ్బు రాబోతే ఇంకెంత అవస్థ చూసుకో.

ఇంతకీ ఏడుకొండలు చెంచయ్యదగ్గిర ఆ బాకీ ఎలా వసూల్జేశా డంటావు? అన్నాడు మునసబుగారు.

ఏమో తెలీదేనాన్నా అన్నాడు గుర్నాధం.

ఆలోచించి చూడు.

నాకు తెలీదే, నీకు తెలుసా? నాకూ తెలీదు. అసలు వాడు వసూలే జెయ్యలేదు. ఏడుకొండలు అవసరాన్ని బట్టి "నేనెరిగిన పెద్ద మనిషి దగ్గిర ఋణమిప్పిస్తాను పట్టు అంటూ మూడోమనిషిద్వారా ఐదొందలు నూటికి నెలకి రూపాయి వడ్డీ మీద నోటురాయింపుకు ఇప్పించాడు చెంచయ్య. నోటు మాటవరసకే అన్నాడు. వడ్డీ నేను సర్దేస్తాలే అని మాట వరుసకు అన్నాడు. ఏడుకొండలకి తను బాకీ ఉన్నది అలా ఫిరాయిం చేస్తానని కూడా మాటవరుసకే అన్నాడు. ఏడాది తిరిగే సరికి, కోర్టునుంచి సమన్లొచ్చాయి. నోటు వరసమూలంగా ఏడుకొండలు రాద్ధాంతంచేస్సి, నువ్వేవోయిచ్చుకో అన్నాడు చెంచయ్యని. నాకేం పట్టె మధ్య, నే న్నీ

బామ్మర్ది ననుకున్నావా, పోవోస్ నీకన్నా మొనగాళ్ళను చూశాం అని గసిరి పారేశాడు చెంచయ్య.

ఏడుకొండలు మాట అలా తూలకపోతే తాను సర్దేవాడేనట. చివరికి ఎక్సుపార్టీ డిక్రీ అయిపోయింది దావా. అమీను గుమ్మాన నిలబడేసరికి అనూ ఓనూ అనకుండా ఐదొందల అరవై కరుకులూ, కోరటు ఖర్చులూ పైగా అమీనుగారి ముడుపూ చెల్లించుకున్నాడు. తరవాత ఏడుకొండలు మళ్ళీ మనిషవలేదు.

మరి నువ్వు సాక్ష్యం ఇవ్వలేదా? ఇలా ఏడుకొండలు చెంచయ్య బదులివ్వగా చూశాను- అని? అని గుర్నాధం తండ్రిని అడగలేదు.

అడిగినా చెంచయ్య ఆ బాకీ తీర్చలేదనడానికి మటుకు సాక్ష్యమే ముందిటా అని తండ్రి అంటాడని అతనికి తెలుసు.

ఇలాటి ప్రశ్నలు అడగరానివనికూడా లోగడ ఇలాటి ప్రశ్న వచ్చినప్పుడు ఆయన చెప్పాడు. ఎందుకో ముందు ముందు నీకే తెలుస్తాయిలే అన్నాడు.

సరేనాన్నా వాణ్ణోసారి అడిగొస్తాను. మళ్ళీ బాకీ తీర్చడానికి నీకు డబ్బెక్కడనుంచి వస్తుందీ, ఎంత వస్తుందీ అని కనుక్కుంటాను. వాడిచేతి కెంతొస్తుందంటే అందులో సగమివ్వచ్చునేమో. అప్పుడు బాకీ తీర్చడానికి అట్టె బాధగా ఉండదుగదా అన్నాడు గుర్నాధం.

నీయిష్టం, నాదేముంది అన్నాడు మునసబుగారు.

• • •

సుబ్బన్న అప్పారావు కథను ఆపి బుస్సురని నిట్టూర్చాడు.

చీమా పాముల సంవాద ప్రకారము

చీమల సింహాద్రి కళ్ళు పెద్దవిచేసి చూసి ఏమయ్యా విచారిస్తు న్నావు. చివరికి అప్పారావుకి గుర్నాధం ఆ అప్పు కాస్తా ఇచ్చేస్తాడని బాధగా ఉందా అన్నాడు.

నాగలక్ష్మి విసుక్కుంది.

సుబ్బన్న మొగలిపొదల మీదనుంచి వచ్చిన గాలిమటుకు అల్పా హారం చేసి మిగతాది నాజూగ్గా వదిలేసి స్తిమితపడి నవ్వాడు.

అబ్బీ మీకేం చల్లగా గుట్టుచప్పుడు కాకుండా మా పుట్టలో దూరి కూచుని పుట్టని అప్పెడతావా అని బేరాలు పోతారు. అప్పెట్టడం ఎంత ముప్పో మీకేం తెలిసేను. చీపంత చింతలేదు తీసుకునేవాడికి, ఇచ్చేవాడి బాధ బోధపడేదెలా? అన్నాడు సుబ్బన్న.

సింహాద్రి చిన్నబుచ్చుకున్నాడు. అబ్బీ సుబ్బన్నా అదేపనిగా అప్పులు చెయ్యడం మాకేం సరదా కాదు.

అసలు తీరికాలేదు. ఇవాళ మీరు ఇచ్చారుగదా అని మేము తీర్చకా పోము; తీర్చాం గదా అని అదే పనిగా అడగనూ అడగము. అడిగిన కొద్దీ ఇస్తున్నారని రేటు నానాటికీ పెంచనూ పెంచము. అప్పుడు, అప్పడి కథలా అసలుకే మోసంవస్తుందని తెలుసు.

అప్పడి కథేమిటి? అసలుకే మోసం ఏ మొచ్చె అంది నాగలక్ష్మి.

తానెరిగిన తాళపత్ర గ్రంథాలలోని అప్పడి కథను అప్పుడు సింహాద్రి ఇలా చెప్పాడు.